# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-09-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర ఆర్థిక సంఘంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు సమావేశమైయ్యారు.**
2. **అమరావతిలో 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాముల కాంస్య విగ్రహ నిర్మాణానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు శంకుస్థాపన చేశారు.**
3. **అమరావతిలో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**
4. **పునరుత్పాదక ఇంధన రంగంలో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**
5. **గుంటూరు జిల్లా తురకపాలెంలో ప్రబలుతున్న విషజ్వరాల పరిస్థితిని తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్య బృందం ఈరోజు పర్యటిస్తోంది.**

==========================

రాష్ట్ర ఆర్థిక సంఘంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు సమావేశమైయ్యారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి అవసరమైన సూచనలు, గ్రామీణ సంస్థలకు నిధుల కేటాయింపు వంటి అంశాలపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. ఈ సమావేశానికి ఆర్థిక సంఘం సభ్యులు, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఇతర అధికారులు హాజరైయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి రాష్ట్ర పర్యాటక విధానంపై సమీక్ష నిర్వహిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాజధాని అమరావతిలోని తుళ్ళూరు-పెదపరిమి మధ్య ఏర్పాటు చేయనున్న పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహం, ఆడిటోరియం, మ్యూజియం, స్మృతి వనం నిర్మాణాలకు మంత్రి టి.జి.భరత్‌తో కలిసి ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో నారా లోకేష్ మాట్లాడుతూ...

..వాయిస్.. 29 సెకన్లు

---------------------------

నంద్యాల జిల్లాలోని శ్రీశైలం జలాశయాన్నికృష్ణానది యాజమాన్య బోర్డు - కేఆర్ఎంబీ ఛైర్మన్ బి.పి.

పాండే ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణా జలాలు, వినియోగం, ఉత్పత్తి, జలాశయంలో వరద నిర్వహణ వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణకు తక్షణం చేయాల్సిన పనులు, ఆనకట్టకు దిగువ భాగంలో ఉన్న ప్లంజ్‌పూల్ మరమ్మతు పనులు, ప్రాజెక్టు భద్రతపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

---------------------------

అమరావతిలో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అమరావతిలో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను ఆయన ఈరోజు పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

పునరుత్పాదక ఇంధన రంగంలో నైపుణ్యాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అమరావతిలో యాక్సెస్ ఎనర్జీ, సుజలాన్ పునరుత్పాదక ఇంధన సంస్థల ప్రతినిధులతో మంత్రి ఈ రోజు సమావేశమైయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చేసుకున్న ఒప్పందాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, పునరుత్పాదక ఇంధన సౌర, పవన ప్రాజెక్టుల ఏర్పాటుకు భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం తరపున అవసరమైన సహకారాన్ని అందిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో త్వరలో ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ అనుసంధానంతో వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఏలూరులో ఈ రోజు నిర్వహించిన చాయ్ పే చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యానికి ప్రాధాన్యతనిస్తున్నాయని తెలిపారు. 75 ఏళ్ళు నిండిన వారికి ఆయుష్మాన్ భారత్ కార్డుల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని ఆయన తెలుపుతూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

గుంటూరు గ్రామీణ మండలం తురకపాలెం గ్రామంలో జ్వరం, అంటువ్యాధులు పరిస్థితిపై రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ రఘునందన్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్య బృందం ఈరోజు పర్యటిస్తోంది. గ్రామానికి వెళ్లి ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు బృందం పర్యటిస్తోంది. ఇందులో భాగంగా గ్రామంలో విష జ్వరాల కేసులు, ఇతర అంశాలపై వైద్య బృందం పరిశీలించి మంత్రికి నివేదిక ఇవ్వనుంది.

ఇదిలా ఉండగా ఇప్పటికే గుంటూరు వైద్యకళాశాలలోని ఆరు విభాగాల నుంచి నిపుణులైన వైద్యులు, సాంకేతిక బృందం, వైద్యారోగ్య శాఖ అధికారులు వచ్చి వైద్యశిబిరం నిర్వహించారు. 35 మంది పరీక్షలు

చేయించుకోగా.. 14 మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో వైద్య బృందం పర్యటన చేపట్టిందని అధికారులు తెలిపారు.

---------------------------

కక్షిదారులకు మెరుగైన న్యాయ సేవలు అందించేందుకు ఈ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ప్రకాశం జిల్లా అదనపు న్యాయమూర్తి టి.రాజావెంకటాద్రి అన్నారు. ఒంగోలులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ సేవా కేంద్రాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు న్యాయమూర్తి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్.. 32 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి యశస్వి పథకం కింద ఉపకార వేతనాల దరఖాస్తులను దాఖలు చేసేందుకు గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాల్లో తొమ్మిది, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు కళాశాలలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఈ ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు నెల్లూరులోని బీ.సీ. సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ - వాయువ్య దిశగా ఒడిషా మీదుగా కదిలే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులపాటుఈరోజు కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జగన్నాథ కుమార్ తెలియజేస్తూ...

వాయిస్..22 సెకన్లు

======================